
ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

ఎచ్చెర్ల, మే 10: ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జిల్లాలో ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పలాసలో ప్రభుత్వ ఐటీఐల్లో 720సీట్లు, 20 ప్రైవేటు ఐటీఐల్లో 3,056 సీట్లు ఉన్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులై, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఐటీఐడాట్ఏపీజీవోవీడాట్ఇన్ వెబ్‌సైట్ ద్వారా వచ్చేనెల 10 లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఒరిజనల్ సర్టిఫికేట్లను సమీపంలో ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకుంటేనే అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు అర్హులు' అని సుధాకరరావు తెలిపారు. అభ్యర్థుల ఫోన్ నెంబర్లకు కౌన్సెలింగ్ వివరాలను తెలియజేస్తామన్నారు.



మోసం గురూ!

అన్నీ మాయ మాటలే

- మైకు పట్టుకుంటే 'నా ఎస్సీలు.. నా బీసీలు' అంటూ ప్రగల్భాలు
- కార్పొరేషన్ల నుంచి పైసా కూడా రుణం ఇవ్వని సీఎం జగన్
- వైసీపీ పాలనలో నిరుద్యోగ యువత ఆశలు ఆవిరి
- ఉపాధి కోసం తప్పని వలసబాట

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తరచూ మైకు పట్టుకుంటూ 'నా ఎస్సీలు, నా బీసీలు, నా ఎస్టీలు' అంటూ వల్లె వేస్తుంటారు. వారి సంక్షేమం కోసం ఎంతగానో ఖర్చు చేశామని చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వైసీపీ ప్రభుత్వంలో అందిన సహకారం అంతంతమాత్రమేనని ఆయా కుల సంఘాల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ ఐదేళ్లలో కులాలవారీ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా రుణం ఇవ్వలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికల వేళ ఆయా సామాజిక వర్గాల ఓట్లు కోసం పరితపిస్తుండడంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. కార్పొరేషన్లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారని, స్వయం ఉపాధి కోసం ఆశగా ఎదురుచూసిన యువతకు రుణాలు మంజూరు చేయలేదని.. ఇప్పుడు ఎలా ఓట్లు అడుగుతున్నారంటూ వైసీపీ నాయకులపై ఆయా సామాజికవర్గాల ప్రజలు మండిపడుతున్నారు. అలాగే ఏటా జాబ్‌క్యాలెండర్ అమలు చేసి.. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న సీఎం హామీ కూడా గాలి బుడగగానే మారిందని ఆరోపిస్తున్నారు. వైసీపీ పాలనలో మోసపోయామని, జగన్‌వి అన్నీ మాయమాటలేనని.. ఈ సారి ఎన్నికల్లో ఆ పార్టీని నమ్మే స్థితిలో లేమని, ఓట్ల ద్వారా వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయమని చెబుతున్నారు.

టీడీపీ హయాంలో స్వయం ఉపాధి...

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా 26 పథకాలు అమలయ్యాయి. ప్రతి ఏడాది రూ.30కోట్ల నిధులిచ్చే వారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సుమారు 7,500యూనిట్లకు అవసరమైన రుణాలను బ్యాంకులతో సంబంధం లేకుండా 40 నుంచి 60 శాతం రాయితీపై ఇచ్చారు. ఆ రుణాలను వినియోగించుకుని అధికమంది పాడి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి పొందారు. అలాగే ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ట్రైకార్ రుణాలతో యువతకు లాభదాయకంగా ఉండేది. అలాగే ఏటా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు రాయితీపై కార్పొరేషన్ల ద్వారా రుణాలిచ్చారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 90శాతం రాయితీతో ఆదరణ పరికరాలు ఇచ్చి చేతి వృత్తులకు దన్నుగా నిలిచారు. ఆటోలు, కార్లు, ఇతర వాహనాలను రాయితీపై అందించి ఎంతోమంది డ్రైవర్లను యజమానులుగా మార్చారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సుమారు రూ.300 కోట్లు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సుమారు 15వేల మందికి దాదాపు రూ.195 కోట్లు రుణాలు అందించారు. దీంతో చాలామంది నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందారు. ఇటువంటి పథకాలిన్నింటినీ వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. నిధులను అడ్డగోలుగా ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించింది. దీంతో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కరువైంది.

కార్పొరేషన్ రుణాలేవీ?

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కార్పొరేషన్ల ద్వారా రుణం మంజూరు చేయలేదు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించలేదు. కులాలు, ఉప కులాలవారీగా పదుల సంఖ్యలో కార్పొరేషన్లు సృష్టించారు. వాటికి చైర్మన్లు, డైరెక్టర్లగా తమ పార్టీ నేతలు, కార్యకర్తలను నియమించి వారికి రాజకీయంగా ఉపాధి కల్పించేశారు. కానీ నిరుద్యోగ యువతను ఆదుకునేలా స్వయం ఉపాధి పథకాలకు పైసా కూడా మంజూరు చేయలేదు. లక్ష మందికిపైగా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటికీ అందలేదు. కానీ, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రుణాల రికవరీపై మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపింది. లబ్ధిదారుల నుంచి బకాయిలు వసూళ్లు చేయాలంటూ అధికారులపై ఒత్తిడి చేసింది. అప్పట్లో జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్‌లో ఎన్ఎస్ఎఫ్‌డీసీ ద్వారా సుమారు రూ.3.5కోట్లు ఇన్నోవా కార్లు, ఇతర వ్యాపారాలకు రుణాలిచ్చారు. ఈ రుణాలకు ష్యూరిటీ సంతకాలు చేసిన ఉద్యోగులకు నోటీసులు జారీచేసి వారి జీతాల నుంచి బలవంతంగా రికవరీ చేస్తున్నారు. జిల్లాలో సుమారు రూ.1.5కోట్ల వరకు ఈ రీతిన రికవరీ చేశారు. రుణాల మంజూరుపై ఇదేస్థాయిలో శ్రద్ధ చూపితే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. స్వయం ఉపాధి అవకాశాలు లేక.. రుణాలు మంజూరుకాక యువత ఉపాధి కోసం తప్పని పరిస్థితిల్లో ఇతర రాష్ట్రాలకు వలసబాట పట్టింది. ఈ నేపథ్యంలో వైసీపీ పాలనపై యువత అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. దీని ప్రభావం ఈసారి ఎన్నికల్లో ఆ పార్టీపై పడనుంది.

బీసీలకు అన్యాయం జరిగింది..



వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు అన్యాయం జరిగింది. కార్పొరేషన్‌లు పెట్టారు కానీ.. వాటివల్ల ఆయా చైర్మన్లకు పదవి లభించింది. మెంబర్లకు కూడా ఫలితం దక్కింది. కానీ బీసీ ప్రజలకు ఈ ఐదేళ్లలో ఏ విధమైనా మేలు జరగలేదు.

-దుక్క బాలరాజు, జలగలింగాపురం, మెళియాపుట్టి

సబ్‌ప్లాన్ నిధులు లేవు..



గిరిజన గ్రామాల అభివృద్ధికిగాను.. ఆర్థికంగా ఉపాధి కలిగేలా సబ్‌ప్లాన్ నుంచి నిధులు మంజూరయ్యేవి. ట్రైకార్ రుణాలు కూడా ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయలేదు. ట్రైకార్ రుణాలూ ఇవ్వలేదు. టీడీపీ ప్రభుత్వంలోనే కార్పొరేషన్ల ద్వారా రుణాలందేవి. చాలామంది బాగుపడ్డాం.


-సవర సుంకయ్య, నందవ, మెళియాపుట్టి

నేటితో ప్రచారం సరి

- సాయంత్రం 6 గంటల వరకే గడువు
- ముమ్మరంగా అభ్యర్థుల పర్యటన
- సమస్యలపై వైసీపీ నేతలను నిలదీస్తున్న జనం
- ఎన్డీఏ కూటమికి జై అంటున్న ప్రజానీకం
- ఇక నుంచి ప్రలోభాల పర్వం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రంతో తెర పడనుంది. ఈ నెల 13న ఎన్నికలు జరగనున్నాయి. నిబంధన ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం ముగించాలి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం 6 గంటలతో అభ్యర్థుల ప్రచారం ముగియనుంది. ఒక్కరోజే గడువు ఉండడంతో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో పాటు వైసీపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులంతా ముమ్మర ప్రచారం చేశారు. మేనిఫెస్టోను వివరిస్తూ.. సమస్యల పరిష్కారంపై హామీలిస్తూ.. తమను గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం కూడా విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ ఐదేళ్లలో ప్రజాసమస్యలపై టీడీపీ పోరాడుతూనే ఉంది. ఏదో ఒక కార్యక్రమం పేరిట టీడీపీ నేతలు జనాలతో మమేకమవుతూనే ఉన్నారు. కాగా.. వైసీపీ నాయకులు గతేడాది గడపగడపకూ మన ప్రభుత్వం పేరిట కొన్ని రోజులు పర్యటించగా.. సమస్యలపై నిలదీతలు ఎదురయ్యాయి. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో పర్యటిస్తున్న వారికి అవే పరిస్థితులు పునరావృతమవు తున్నాయి. రోడ్లు బాగోలేదని.. తాగునీటి సమస్య పరిష్కరించలేదని.. ఇప్పుడు ఎలా ఓట్లు అడుగుతారంటూ నిలదీస్తున్నారు. శుక్రవారం స్పీకర్ తమ్మినేనికి సరుబుజ్జిలి మండలంలో ఇటువంటి పరిస్థితి ఎదురుకాగా.. ఇవన్నీ మామూలేనంటూ ఆయన ప్రజలకు అభివాదం చేసి వెళ్లిపోయారు. కాగా.. వైసీపీ పాలనపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగులు సైతం వైసీపీకి వ్యతిరేకంగా.. టీడీపీకి 90శాతం మేర ఓట్లు వేశారని ప్రచారం సాగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఈసారి ఎన్నికల బరిలో దిగుతుండడంతో.. వైసీపీలో ఓటమి భయం పట్టుకుంది. మేనిఫెస్టో ప్రకారం చూస్తే.. వైసీపీ కన్నా కూటమి అధికారంలోకి వస్తేనే రెట్టింపు మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతలు ప్రలోభాలకు తెర తీస్తున్నారు. అనుచరులు, మాజీ వలంటీర్ల ద్వారా ఓటర్లకు డబ్బులు, మద్యం పంపిణీకి శ్రీకారం చుట్టారు. మరోవైపు ఎన్నికల కోసం వచ్చిన కోట్లాది రూపాయల పంపిణీ విషయంలో కొంతమంది నాయకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రలోభాలపర్వంపై అధికారులు మరింత నిఘా పెట్టారు. డబ్బుల పంపిణీ, నిబంధనల ఉల్లంఘనపై 'సీ విజిల్' తోపాటు నేరుగా ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మన్‌జీర్‌జిలానీ సమూన్ తెలిపారు.



పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి

ఎన్నికల్లో విజయానికి ఈ రెండు రోజులు అత్యంత కీలకం. అభ్యర్థులు ప్రతి ఒక్క అనుచరుడ్ని.. ఓటర్లను జాగ్రత్తగా చూసుకోవాల్సిన సమయమిదే. ఈసారి వైసీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. దీంతో పోల్‌మేనేజ్‌మెంట్‌లో భాగంగా అర్ధరాత్రిళ్ల వరకు మంతనాలు.. మూకుమ్మడిగా ఓట్లను కొనుగోలు చేసేలా ఇతరత్రా కార్యక్రమాలు చేపడతారు. టీడీపీ నేతలు కూడా ముందుగానే పరిస్థితులు అంచనా వేసి.. విజయమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. పోల్ మేనేజ్‌మెంట్‌లో ప్రజలను తమవైపు అనుకూలంగా మార్చుకోగలిగితే.. గెలుపు సునాయాసమని ఇరుపార్టీల అభ్యర్థులు భావిస్తున్నారు.

ఆటోడ్రైవర్‌పై వైసీపీ శ్రేణుల జులుం

- తమ్మినేని కారుకు వాహనం అడ్డుగా నిలిచిందని ఆగ్రహం
- ఇదేం దౌర్జన్యమంటూ తిరగబడిన ఆటోలోని మహిళలు



ఆటోడ్రైవర్‌తో వైసీపీ శ్రేణుల వాగ్వాదం

సరుబుజ్జిలి, మే 10: స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల ప్రచారంలో స్వల్ప వాగ్వాదం జరిగింది. శుక్రవారం అలికాం-బత్తిలి ప్రధాన రహదారి నుంచి చిన్న షలంత్రి గ్రామానికి స్పీకర్ కాన్వాయ్ వెళ్తోంది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన ఆటో మహిళలతో వస్తూ మార్గమధ్యంలో స్పీకర్ కారుకు అడ్డంగా నిలిచిపోయింది. వెంటనే స్పీకర్ అంగరక్షకులు వెళ్లి ఆటోను పక్కకు తీయాలని చెప్పగా.. ఏదో రిపేర్ అయి స్టార్ట్ కాలేదని డ్రైవర్ గాలాల శివప్రసాద్ బదులిచ్చాడు. చిన్నషలంత్రి గ్రామానికి ఐదేళ్లుగా రహదారి సౌకర్యం కల్పించలేదని.. గ్రామస్థులు రాజకీయ నాయకులపై వెళ్లగక్కుతున్న చర్యల్లో ఇదొకటని కొంతమంది వైసీపీ కార్యకర్తలు ఆటోడ్రైవర్ శివప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్‌తో వాగ్వాదం చేశారు. ఇంతలో ఆటోలో ఉన్న మహిళలు కిందకు దిగి ఆటోడ్రైవర్‌పై దౌర్జన్యం ఏమిటని ప్రశ్నించారు. చివరకు స్పీకర్ కలుగజేసుకుని.. ఇవన్నీ మామూలేనని డ్రైవర్‌ను ఏమీ అనొద్దని.. ఆటోను పక్కకు నడిపించాలని సూచించారు. దీంతో వాగ్వాదం సద్దుమణిగింది.



వైసీపీ శ్రేణుల తీరును నిలదీస్తున్న మహిళలు

- అదే ప్రాంతంలో ఉపాధి పనులు చేస్తున్న చిన్న షలంత్రి ప్రజలు.. తమ గ్రామానికి రహదారి వేయలేదని, ఓటు కోసం ఏ నాయకుడూ తమ గ్రామానికి రావద్దని స్పీకర్ ముందు ఖరాఖండీగా చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే షలంత్రి రహదారి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని స్పీకర్ హామీనిచ్చారు. గ్రామస్థులంతా ఇక్కడే ఉన్నందున మరి గ్రామంలోకి వెళ్లనంటూ అక్కడ నుంచే వెనుదిరిగారు.
- ఆటోడ్రైవర్ శివప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజాప్రతినిధులకు విన్నవించినా.. పట్టించుకోలేదని ఆరోపించారు. రోడ్లు బాగోలేక వాహనాలు పాడైపోతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రహదారి అభివృద్ధి నోచుకోకపోవడంపై ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామ యువత సోషల్ మీడియాలో ప్రచారం చేసినా.. పాలకులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ జీవో రద్దు.. ఉత్తిదే

- థర్మల్ ఉద్యమకారులపై కొనసాగుతున్న కేసులు
- నెరవేరని సీఎం జగన్మోహన్‌రెడ్డి హామీ

(టెక్కలి)

సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలో థర్మల్ ఉద్యమకారులపై ఏళ్ల తరబడి కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. తాము అధికారంలోకి వస్తే కేసులు ఎత్తివేస్తామని, జీవో నెంబర్ 1108 రద్దు చేస్తామన్న సీఎం జగన్ హామీ ప్రకటనకే పరిమితమైందని ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాకరాపల్లి పరిధిలో 2,050ఎకరాల్లో 2640మెగావాట్లతో రూ.6,500కోట్లతో నిర్మించతలపెట్టిన ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ పవర్‌ప్లాంట్‌తో పర్యావరణానికి పెను ప్రమాదం ఉందని స్థానికులు మొదటి నుంచీ అడ్డుతగిలారు. పరిశ్రమ వద్దంటూ కాకరాపల్లి, ఆకాశలక్కవరం, సుగ్గువానిపేట, హెచ్ఎన్‌పేట, వడ్డితాండ్ర తదితర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున కొన్నేళ్ల కిందట ఆందోళన చేపట్టారు. ప్రాజెక్ట్ ఇక్కడ నిర్మిస్తే.. తాము జీవనోపాధి కోల్పోతామని మత్స్యకారులు, భూములు నష్టపోతామని రైతులు.. థర్మల్‌కు వ్యతిరేకంగా ఉద్యమంలో పాల్గొన్నారు. ఈక్రమంలో పోలీసుల కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. అలాగే వడ్డితాండ్రలో బాష్పవాయువు గోలీలు, పొగబాంబులు ప్రయోగించారు. 250 మందిపై అప్పట్లో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులు ఎత్తివేయాలని, పవర్ ప్లాంట్‌కు సంబంధించి విడుదల చేసిన జీవోనెం.1108ని రద్దు చేయాలని మత్స్యకారులు, రైతులు, ఉద్యమకారులు గత ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌ను కోరారు. తాము అధికారంలోకి కచ్చితంగా న్యాయం చేస్తామని జగన్ భరోసా ఇచ్చారు. కానీ ఇంతవరకూ వాటి ఊసేలేదని ఉద్యమకారులు ఆవేదన చెందుతున్నారు. మత్స్యకార మహిళలు మూడేళ్లకుపైగా వడ్డితాండ్ర జంక్షన్‌లో రిలేదీక్షలు కొనసాగిస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించడం లేదని ఉద్యమకారులు వాపోతున్నారు.



1108 జీవో రద్దు కోరుతూ వడ్డితాండ్రలో మత్స్యకారుల రిలేదీక్షలు (ఫైల్)

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మే 10: సాధారణ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన పర్యావరణహిత స్వీప్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను' అంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధమని తెలిపారు. ఈ నెల 13న పౌరులంతా ఓటు వేసి.. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు సహకరించాలని కోరారు. సమస్యాత్మక కేంద్రాల్లో సైతం పోలింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, వెంకట్ ఉజ్వల్, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, వైద్యులు శిల్లా సతీష్‌కుమార్, వంశీకృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, మే 10: పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పలు కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎన్‌సీసీ కమాండెంట్స్, కో-ఆర్డినేటర్స్, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలంటూ స్పష్టం చేశారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ డా.జి.ప్రేమ్‌కాజల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

అన్నీ ఫోన్లో వద్దులే.. వాట్సాప్ కాల్ చేస్తా.!

(నరసన్నపేట)



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చాలామంది తమ స్నేహితులు, బంధువులు, సన్నిహితులతో మనసువిప్పి ప్రశాంతంగా మాట్లాడలేని పరిస్థితి నెలకొంది. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ ఉదంతం ఆ రాష్ట్రాన్ని కుదిపేసింది. ఐపీఎస్ అధికారులు సైతం జైలుకు వెళ్లేలా చేసింది. అదే ఫీవర్ ఇక్కడా పట్టుకుంది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు అనేక ఇతర సంఘాల నాయకులు ఫోన్లో మాట్లాడేందుకు భయపడుతున్నారు. ఎవరి ఫోన్ ట్యాపింగ్‌లో ఉందో.. ఎవరి ఫోన్‌కాల్ రికార్డ్ అవుతుందో.. మరెవరి ఫోన్ స్పీకర్ ఆన్‌లో ఉందోనంటూ భయభ్రాంతులకు గురవుతున్నారు. ఫోన్ కాల్ కంటే వాట్సాప్ కాల్ ఉత్తమమని భావించిన అనేక మంది ఈ విధానాన్నే పాటిస్తున్నారు. ప్రస్తుతం రాజకీయంగా పలుకుబడి ఉన్నవారు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు వాట్సాప్ కాల్‌లోనే ఎక్కువ మాట్లాడుకుంటున్నారు.

ఎలాగైనా గెలవాల్సిందే..

- 'స్థానిక' పోరును తలపిస్తున్న సార్వత్రిక ఎన్నికలు

(నరసన్నపేట)

గతంలో ఎన్నడూ లేని విధంగా సార్వత్రిక ఎన్నికల సమరం జరుగుతోంది. ఎలాగైనా గెలవాలని అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు. సాధారణంగా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు గ్రామీణులు అంత ప్రాధాన్యం ఇవ్వరు. ఎన్నికల రోజుకు స్థానికంగా ఉన్న వారితోనే ఓట్లు వేయిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రం గ్రామాల్లోని ప్రతి ఓటరు వచ్చేలా చూస్తారు. ఈసారి ఎన్నికలు ప్రతిష్టాత్మకం కావడంతో స్థానిక సమరాన్ని తలపిస్తున్నాయి. వలస వెళ్లిన వారిని ఎలాగైనా సొంత ప్రాంతాలకు తీసుకొచ్చి.. ఓటు హక్కు వినియోగించుకొనేలా వివిధ పార్టీల అభ్యర్థులు ప్రణాళికలు రూపొందించారు. గతంలో కేవలం స్థానిక ఎన్నికల సమయంలోనే అభ్యర్థులు వలస ఓటర్లను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేసేవారు. ఈసారి అన్ని పార్టీల అభ్యర్థులూ వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్న ఓటర్లను తరలించేందుకు ఎంత మొత్తంలో చెల్లిస్తున్నారో.. ప్రయాణ ఖర్చులు ఏ మేరకు భరిస్తున్నారో తెలుసుకొని వారి మరో అభ్యర్థి అంతకుమించి ఓటర్లకు తాయిలాలు ఇచ్చి ఓటర్లను తెప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం ప్రత్యేకంగా బస్సులు, వాహనాలను కూడా నడుపుతున్నారు.

సమయం లేదు మిత్రమా!

- పోలింగ్‌కు రెండు రోజులే గడువు
- గెలుపుకోసం సర్వశక్తులూ ఒడ్డుతున్న అభ్యర్థులు
- గంపగుత్తగా ఓట్లకు గాలం
- బేరసారాలకు దిగుతున్న వైనం



(నరసన్నపేట)

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మరో రెండు రోజుల గడు వు మాత్రమే ఉంది. విజయం కోసం అభ్యర్థులు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. సమయం లేకపోవడంతో గెలుపు కోసం అందుబాటులో ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. సామ, బేధ, దండోపాయాలు ప్రయోగిస్తున్నారు. ఏదైనా వర్గం లేదా సమూహం ఎవరు చెబితే మాట వింటుందో వారిపై దృష్టి సారిస్తున్నారు. గంపగుత్తగా ఓట్లకు గాలం వేస్తున్నారు. అటువంటి ప్రభావం చూపే నేతలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పార్టీలో అయినా చేరండి.. ప్యాకేజీ గురించైనా చెప్పండని అభ్యర్థులు బేరసారాలకు దిగుతున్నారు. అవసరమైతే డబుల్ గేమ్ ఆడిస్తున్నారు. అంటే పార్టీ మారకుండా ప్రత్యర్థితో ఉంటూ తమకు సాయం చేసేలా కోవర్టు రాజకీయాలు సాగుతున్నాయి.

గెలిపిస్తే పదవి ఇప్పిస్తా..

పదవులపై ఆశ, ఆసక్తితోనే రాజకీయాల వైపు అడుగులు పడుతుంటాయి. ప్రస్తుతం ఎన్ని కల సీజన్ కావడంతో నన్ను గెలిపిస్తే మీకు పదవి ఇప్పిస్తా పనులు చేయిస్తానని హామీ ఇచ్చి సాయం పొందుతున్నారు. ఎన్నికల బరిలో నిలిచి గెలవలేమన్న భావనలో ఉన్న అభ్యర్థులు మంతనాలు జరుపుతూనే వారి సహచరులను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 'మీ అభ్యర్థి ఎలాగూ గెలవడు.. నాకు సహకరిస్తే మీకు న్యాయంచేస్తా' అని ఇతర పార్టీ నాయకులను తమ పార్టీలో చేర్చుకుంటున్నారు.

మరో 48 గంటలే..

పోలింగ్‌కు 48 గంటల సమయం మాత్రమే మిగిలి ఉంది. ఈ తరుణంలో ప్రతినిమిషం కీలకం. దీంతో అభ్యర్థులు సుడిగాలిలా ప్రచారం చేస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తెల్లవారుజామునే ప్రచారబాట పడుతున్నారు. ఎండ చుర్రుమన్నా... చినుకులు రాలుతున్నా లెక్క చేయడంలేదు. ఓటర్లను కలవాలంటే ఇదే సరైన సమయమనుకున్న నేతలు తెల్లారింది లేవండోయ్.. అంటూ అనుచరులతో కలిసి కోడి కూయకముందే నుంచే ప్రచారానికి సిద్ధమవుతున్నారు. తెల్లవారేసరికే ఓటర్ల ముందు వాలిపోతున్నారు. వ్యాయా మశాలలు, క్రీడా మైదానాలు, పార్కుల్లో పర్యటిస్తూ తమ పార్టీకే ఓటువేయాలని కోరు తున్నారు. మేనిఫెస్టోను వివరిస్తూ, కరపత్రాలు పంచుతూ, హామీలు వర్షం కురిపిస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

పైకి గాంభీర్యం.. లోలోన గుబులు

అభ్యర్థులు ఎలాగైనా గెలవాలని వ్యూహాలు రచిస్తున్నారు. పైకి గాంభీర్యంగా కనిపిస్తున్నా లోలోన గుబులుగానే ఉంటున్నారు. ఏ పార్టీ, ఏ వర్గం ఓట్లకు ఎసరు పెడుతుందోనని లెక్కలేసుంటున్నారు. దాని ప్రకారం ఆ వర్గం ఓట్లకోసం తీవ్రంగా శ్రమిస్తోన్నారు. కొందరు అభ్యర్థులు ఇవే చివరి ఎన్నికలని బరిలో దిగారు. దీంతోవారు ప్రతి ఓటూ కీలకంగా భావిస్తున్నారు. ప్రచారానికి తక్కువ సమయం మాత్రమే ఉంది. దీంతో ఉరుకులు, పరుగులు పెడుతున్నారు.

రాత్రికి రాత్రే పార్టీల మార్పు..

ప్రతి పార్టీలోనూ చేరికలు ముమ్మరంగా సాగుతున్నాయి. నాయకులను బతిమిలాడి తమ పార్టీలోకి చేర్పించుకునేం దుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా, మం డల, గ్రామ స్థాయి నాయకులు చివరి నిమిషంలో పార్టీలు మారడం చర్చనీయాంశంగా మారింది. 'మీ వెంట మేము ఉన్నామని భరోసా ఇచ్చిన వారే' రాత్రికి రాత్రేపార్టీలు మారడం, సోషల్ మీడియాలో వైరల్ కావడం అభ్యర్థులకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. తక్షణమే దిద్దుబాటు చర్యలకు అభ్యర్థులు ఉపక్రమిస్తున్నారు.



రోజుకొక మాట.. పూటకొక వేషం..

ఈ ఎన్నికల్లో డబ్బు ప్రభావం బాగానే కనిపిస్తోంది. నిన్నటి వరకు నోటికొచ్చినట్లు దూషించిన నేతాగణం.. అదే నోటితో నాయకులను పొగిడేస్తున్నారు. రోజుకొక మాట.. పూటకొక వేషం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామ, మండల, వార్డు స్థాయి, ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు, అధికార పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్తలుగా చెప్పుకునే వారంతా ఒక్కసారిగా మాట మార్చేశారు. తిట్టిన నోటితోనే పొగడ్తలతో తమ నేతలను ముంచెత్తుతున్నారు. ఇవి విని విస్తుపోవడం జనం వంతవుతోంది. 'సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి.. సమాజంలో మాకు ఏమాత్రం గౌరవం లేకుండా చేసేశారు. జనమంతా ఏ అవసరం వచ్చినా, పనిపడినా వలంటీర్ల దగ్గరకే వెళ్లిపోతున్నారు తప్ప మా దగ్గరకు రావడం మానేశారు. మాకెందుకు ఈ పదవులు? నాలుక గీసుకోవడానికా?' అని నిన్నమొన్నటి వరకు బాహాటం గానే వార్డు కౌన్సిలర్లు, గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీలు వాపోతుండే వారు. గ్రామ పంచాయతీల్లో వీధిదీపాలు కూడా వెలిగించు కోలేకపోతున్నామని, కాలువలు శుభ్రం చేసుకోలేకపోతున్నామ ని, పంచాయతీల డబ్బులన్నీ వేరే పథకాలకు దారి మళ్లించేశారని వాపోయిన కొందరు సర్పంచ్‌లు వాటన్నిటినీ ఇప్పుడు పక్కన పెట్టేశారు. అదే నోటితో జిందాబాద్‌లు కొడతున్నారు. కొందరు ఉద్యోగులు, ఉపాధ్యాయుల తీరు కూడా ఆక్షేపనీయమే. షెడ్యూల్ వచ్చే వరకు 'ఎన్నికలు వస్తే మా తడాఖా చూపిస్తామని' శపథం చేసిన వారంతా నేడు గప్‌చుప్ అయిపోయారు. స్థానిక ఎమ్మెల్యేలను, నాయకులను, జిల్లా పార్టీ పెద్దలను, ఏకంగా సీఎంను తూలనాడిన వారంతా ఎంచక్కా మౌన మునులుగా మారిపోయారు. తాము పడిన ఇబ్బందుల విషయం ఎక్కడా ప్రస్తావించడం మానేశారు. ఎన్నికల వరకు ఆ విషయాలు మాట్లాకూడదనే షరతులే దీనికి కారణమని చర్చసాగుతోంది. ఇదంతా ఎన్నికల 'తాయిలాల' ప్రభావమేనన్నది జగమెరిగిన సత్యం.



ధర్మాన.. మీకిది ధర్మమేనా?

- గొప్పలు తప్ప అభివృద్ధి ఏదీ?
- ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తుంటే ఏం చేస్తున్నారు?
- కార్మికులు రోడ్డున పడుతున్నా పట్టదా?
- రెవెన్యూ మంత్రిపై పెద్దపాడు యాదవుల ఆగ్రహం

(శ్రీకాకుళం క్రైం)

'గొప్పలు చెప్పుకోవడం తప్ప నియోజకవర్గానికి మీరేం చేశారు. ఒక్క సమస్య అయినా పరిష్కరించారా?. ప్రభుత్వ ఆస్తులు కబ్జాకు గురవుతుంటే ఏం చేస్తున్నారు. కార్మికులు రోడ్డున పడుతున్నా పట్టదా?' అని రెవెన్యూశాఖ మంత్రి, శ్రీకాకుళం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావుపై పెద్దపాడు గ్రామ యాదవులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం యాదవ సంఘ రాష్ట్ర నాయకుడు కలగ శ్రీనివాస యాదవ్, కాల వెంకట్రావు యాదవ్, మామిడి శంకర్ యాదవ్ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2003లో శ్రీకాకుళం నియోజకవర్గంలో అడుగుపెట్టిన ధర్మాన ప్రసాదరావు వెంట గతేడాది వరకూ తిరిగామని, తమ గ్రామాన్ని, సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేయాలని మొర పెట్టుకున్నా ఆయన పట్టించుకోలేదని మండిపడ్డారు. తన వ్యాపార లావాదేవీలు చూసుకున్నారే తప్ప తమ గ్రామానికి, శ్రీకాకుళం నియోజ కవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. ధర్మాన తీరు నచ్చక పెద్దపాడుకు చెందిన 100 మంది వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు చెప్పారు. ఆలయాల హుండీల దోపిడీ, పోరం బోకు, డీపట్టాల స్థలాలు, ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తుంటే మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో పదిస్టోన్ క్రషర్లు మూతపడి వంద మంది కార్మికులు రోడ్డుపడినా ధర్మానకు పట్టలేదని ఆరోపించారు. 'టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.14 కోట్లతో శ్రీకాకుళం- ఆమదాలవలస పరిధిలో పది కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులు పూర్తిచేయలేదు. ఎక్కడ టీడీపీకి పేరొస్తుందోనని నిధులు కాజేశారు తప్ప పనులు చేపట్టలేదు. చిన్నపాటి వర్షానికే ఆర్టీసీ కాంప్లెక్స్ మునిగిపోతుంది. ఈ ఐదేళ్లలో ఈ సమస్య పరిష్కరించడంలో మంత్రి విఫలమయ్యారు. కనీసం రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించలేదు. దీంతో అద్దెభవనంలో నెట్టుకురావాల్సి వస్తోంది. కేఆర్ స్టేడియం పూర్తిచేయడానికి ఐదేళ్ల చాలలేదా?.



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపాడు గ్రామస్థులు

మునసబుపేట వద్ద నర్సింగ్ కళాశాల భవనాన్ని ప్రారంభించకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కాలువలు, రోడ్ల పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. యాదవులకు సామాజిక భవనం కావాలని అడిగినా పట్టించుకోలేదు. కానీ, ఆయన సామాజికవర్గ భవనానికి మాత్రం శ్రీకాకుళం కంపోస్టు కాలనీలో మూడు ఎకరాలు కేటాయించారు. మా గ్రామంలోని తాగునీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. ఐదేళ్లుగా మా గ్రామంలో ఉపాధి పనులు కల్పించడలేదు. అన్నక్యాంటీన్లు రద్దు చేసి అక్షయ పాత్ర ప్రవేశపెట్టిన వైసీపీ ప్రభుత్వం వారికి కూడా బిల్లులు చెల్లించలేదు' అని తెలిపారు.

నన్ను గెలిపిస్తే కనీవిని ఎరుగని అభివృద్ధి చేస్తా

ఇంటర్వ్యూ

- యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా
- డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేయిస్తా
- సాగునీటి కాలువలను ఆధునికీకరిస్తాను
- ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఈశ్వరరావు



(రణస్థలం)

ఎచ్చెర్ల నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) స్పష్టం చేశారు. తనకు అవకాశం ఇచ్చిన మూడు పార్టీల నాయకత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. తనను ఎన్నుకుంటే ఐదేళ్లలో ఎన్నడూ కనివినీ ఎరుగని అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. శుక్రవారం ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ముఖాముఖి నిర్వహించింది. పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.

ప్రశ్న: ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారా?

జవాబు: కచ్చితంగా. ఎచ్చెర్ల అంటేనే పారిశ్రామికంగా పట్టున్న నియోజకవర్గం. జిల్లాలో ఉన్న ఏకైక పారిశ్రామిక వాడ పైడిభీమవరంలో ఉంది. ఎస్ఏసీఎల్, శ్యాంక్రగ్, శ్యాంఫీస్టన్, అరబిందో, ఏవోల్, రెడ్డీస్‌తో పాటు అనేక రసాయన పరిశ్రమలు ఉన్నాయి. బేవరేజెస్ పరిశ్రమ కూడా ఉంది. గతంలో నేను టీడీపీ నేతగా, ఈ ప్రాంతీయ స్వచ్ఛంద సేవకుడిగా స్థానిక నిరుద్యోగ యువతకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని కోరాను. దీనికోసం ఆందోళనలు కూడా చేశాను. ఎమ్మెల్యేగా ఎన్నికైతే పరిశ్రమల నిబంధనలకు లోబడి ఎక్కువ శాతం ఉద్యోగాలను స్థానికులకు కేటాయించేలా చర్యలు తీసుకుంటాను. నియోజకవర్గంలోని ప్రతీ నిరుద్యోగికి ఉపాధి కల్పించేందుకు ప్రయత్నిస్తాను. ఇందుకుగాను ప్రత్యేక సెల్‌ను సైతం ఏర్పాటు చేస్తాను.

ప్ర: మత్స్యకారుల అభివృద్ధి కోసం ఏం చేస్తారు.?

జ: ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో 11 మత్స్యకార పంచాయతీలు ఉన్నాయి. కానీ స్థానికంగా వేట గిట్టుబాటు కాక మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. అందుకే బుటగట్లపాలెంలో జెట్టీ నిర్మాణానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తా. అవసరమైతే కేంద్ర మంత్రిత్వ శాఖతో మాట్లాడతా. ఎట్టి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఇక్కడ జెట్టీ నిర్మాణం జరిగేలా చూస్తా.

ప్ర: రణస్థలంలో హైవే విస్తరణ సమస్యను పరిష్కరిస్తారా?

జ: కచ్చితంగా. రణస్థలం మండల కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టడంలో అధికార వైసీపీ విఫలమైంది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యపై దృష్టిపెడతా. హైవే విస్తరణలో భాగంగా విశాఖ నుంచి నరసన్నపేట వరకూ ఆరులైన్ల రహదారి నిర్మాణం జరిగినా రణస్థలంలో మాత్రం పెండింగ్‌లో పెట్టారు. టీడీపీ ప్రభుత్వం అవుటర్ రింగ్ రోడ్డు కోసం భూసేకరణ చేపట్టినా పనులు చేయలేకపోయారు. ఇప్పుడు ఫ్లైఓవర్ అంటూ కొత్త నాటకం ఆడారు. అయితే ఎక్కువ తక్కువ కొలతలు తీసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అందుకే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి దీనికి చక్కటి పరిష్కార మార్గం చూపిస్తా.

ప్ర: సాగు, తాగునీటి ప్రాజెక్టుల సంగతేంటి?

జ: నియోజకవర్గంలో అపార నీటి వనరులు ఉన్నాయి. ఎచ్చెర్ల మండలానికి నారాయణపురం ఆనకట్ట, జి.సిగడాం మండలానికి మడ్డువలస, లావేరు, రణస్థలం మండలాలకు తోటపల్లి ప్రాజెక్టుల నుంచి సాగునీరు అందాల్సి ఉంది. కానీ శివారు ఆయకట్టుకు సాగునీరు అందించలేని స్థితిలో కాలువలు ఉన్నాయి. నేను ఎమ్మెల్యేగా గెలిస్తే కాలువలను విస్తరించడంతో పాటు ఉన్నవాటిని ఆధునికీకరిస్తాం. ఖరీఫ్, రబీలో పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందేలా చేస్తా. మెగా ప్రాజెక్టుల నిర్మాణానికి కృషిచేస్తా.

ప్ర: విద్యాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జ: నియోజకవర్గంలో విద్యాపరంగా అభివృద్ధికి ముందడుగు వేస్తా. రణస్థలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీతో పాటు లావేరు, జి.సిగడాం మండలాల విద్యార్థుల కోసం పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీ ఏర్పాటుకు కృషిచేస్తా. ఎచ్చెర్ల మండలం ఎడ్యుకేషనల్ హబ్‌గా ఉంది. ట్రిపుల్ ఐటీతో పాటు అంబేడ్కర్ యూనివర్సిటీలు ఉన్నాయి. ముఖ్యంగా ట్రిపుల్ ఐటీలో వసతులు మెరుగుపరచడం వంటి వాటిపై దృష్టిపెడతా.

ప్ర: తొలిసారి బరిలోకి దిగడం ఎలా ఉంది.?

జ: కూటమి అభ్యర్థిగా బరిలో దిగడం చాలా ఆనందంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రం నుంచి నిధులు రాబెట్టేందుకు ఇదో అద్భుత అవకాశం. నేరుగా బీజేపీ హైకమాండ్‌తో మాట్లాడి ప్రధానమంత్రి సడక్ యోజన పథకం ద్వారా అన్ని గ్రామాలకు పక్కా రహదారులు, కేంద్ర నిధులతో సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు మౌలిక వసతులు కల్పించవచ్చు. అందుకే ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజలు కమలం గుర్తుపై ఓటువేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నాను.

జగనన్నా.. శుద్ధజలాలు ఏవీ?

- 'సుజలధార'ను నిర్వీర్యం చేసిన వైసీపీ సర్కారు
- మదర్‌ప్లాంట్లు మూత
- 20 లీటర్ల క్యాన్ ధరను పెంచిన వైనం
- కిడ్నీ రోగులు, పేదలకు తప్పని ఇబ్బందులు



పలాస వద్ద ఏర్పాటు చేసిన మదర్‌ప్లాంట్

(పలాస)

ఉద్దానం వాసుల దాహార్తిని తీర్చే ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని వైసీపీ సర్కారు నిర్వీర్యం చేస్తోంది. కొన్నిచోట్ల ఉద్దేశ పూర్వకంగానే సుజలధార మదర్‌ప్లాంట్లను మూసివేసింది. 20 లీటర్ల నీటి క్యాన్ ధరను రూ.2 నుంచి రూ.7 పెంచి పేదలపై భారం మోపింది. దీంతో శుద్ధజలాలు అందక కిడ్నీ రోగులు, పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పథకం లక్ష్యం..

పలాస నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో 2017 సెప్టెంబరు 18న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని ప్రారంభించింది. ఉద్దానం ప్రాంతంలో ప్రబలే కిడ్నీవ్యాధులకు తాగునీరు కూడా ఓ కారణమని గుర్తించి శుద్ధ జలాలను తక్కువ ధరకే అందించాలని నిర్ణయించారు. దీంతో కేవలం రూ.2కే 20 లీటర్ల శుద్ధ జలాలను అందించేందుకు చర్యలు తీసుకున్నారు. తొలుత నీటిని మదర్‌ప్లాంట్లు ద్వారా శుద్ధి చేసి ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నాణ్యమైన నీరు సరఫరా చేసేవారు. ఆ తర్వాత ఉద్దానం ప్రాంతంలోని పలు గ్రామాల్లో ప్లాంట్లు ఏర్పాటుచేసి ఏటీఎం మిషన్లు మాదిరిగా నీటిని సరఫరా చేసేవారు. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో సుజలధార పథకం కోసం రప్పించిన ప్లాంట్లు అన్నీ ముందుగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు అవసరమని భావించి అక్కడ నుంచి తరలించి ఆఘమేఘాలపై ప్రారంభించి ప్రజలకు శుద్ధ జలాలు అందించారు. దీనికితోడు అందరికీ శుద్ధజలాలు అందజేయాలన్న ఉద్దేశంతో ఈ పథకం సమర్థంగా నిర్వహణకు టీడీపీ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంది.

పేరు మార్చుచేసి.. ప్లాంట్లు మూసేసి..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శుద్ధ జలాల పథకం పేరు ముందుగా మార్చుచేశారు. అనంతరం రూ.2లు ధర ఉన్న నీటిని రూ.7కు పెంచారు. దీంతో పలువురు పేదలు, కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాల ప్రజలపై ఆర్థిక భారం పడింది. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో అదనంగా డబ్బులు చెల్లించి నీటిని వినియోగించుకుంటున్నారు. క్రమేపీ మదర్‌ప్లాంట్లు మూసివేసివేయడంతో పాటు నిత్యం నీరందించే చిన్నప్లాంట్లు సైతం మూతవేయించారు. మొత్తం నియోజకవర్గంలో 18 పాంట్లు ప్రారంభించగా ప్రస్తుతం తొమ్మిది మాత్రమే పనిచేస్తున్నాయి. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ఆరు ఏర్పాటు చేయగా నాలుగు మూతపడ్డాయి.

సుజలధారే ఆధారం..

సమగ్ర మంచినీటి పథకం మంజూరుచేశామన్న సాకుతో మొత్తం ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని నిర్వీర్యం చేయడం విశేషం. అయితే ప్రస్తుతం అనేక గ్రామాల్లో సమగ్ర మంచినీటి పథకం ఉన్నా నీరందకపోవడంతో ఎన్టీఆర్ సుజలధార పథకం నీటిపైనే ఆధారపడాల్సివస్తోంది. ఈ పథకం ప్రారంభంతో తమకు నీటికష్టాలు తీరాయని అప్పట్లో ప్రజలు సంతో షించారు. అయితే వారి సంతోషం ఎక్కువ రోజులు ఉండలేదు. వైసీపీ పాలకులు గత ప్రభుత్వానికి పేరు రాకూడదన్న ఉద్దేశంతో సుజలధార పథకాన్ని క్రమేణా నీరుగార్చారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పథకాన్ని ఆధునీకరించి ప్రతి గ్రామానికి విస్తరించి ఉంటే ప్రజలకు శుద్ధ జలాలు అందడంతో పాటు శాశ్వతంగా తాగునీటి సమస్య కూడా పరిష్కారమయ్యేది. కానీ వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో మొత్తం పథకం మూతపడే దశకు తీసుకువచ్చారు.

పథకం ప్రకారం నిర్వీర్యం..



టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన సుజలధార పథకం ఎంతోమందికి దాహార్తిని తీర్చడంతో పాటు కిడ్నీ బాధిత గ్రామాల ప్రజలకు ఉపయోగపడింది. దీన్ని పథకం ప్రకారం నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరిగింది. సుజల ధార పథకం మూసివేసి గత ప్రభుత్వ ఆశయాన్ని తుంగలోకి తొక్కారు.

-టంకాల రవిశంకర్‌గుప్తా, పలాస



పలాస హడ్కో కాలనీ వద్ద మూతపడిన సుజలధార ప్లాంట్

ఓటరు స్లిప్ లేదా.. ఆందోళన వద్దు

హిరమండలం: ఓటర్లకు బూత్‌ల వారీగా సిబ్బంది ఇంటింటికి తిరిగి స్లిప్పులు అందజేస్తున్నారు. ఈనెల 13న పోలింగ్‌నకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తాత్కాలికంగా అందుబాటులో లేని వారి స్లిప్పులను సమీపంలోని కుటుంబాలకు అందజేశారు. మృతి చెందిన వారు, చిరునామా మారిన వారి స్లిప్పులు ఎక్కువ శాతం సిబ్బంది వద్దే ఉండిపోతున్నాయి. ఒకవేళ ఓటరు చీటీ రాకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జాబితాలో పేరు ఉంటే నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఈసీ అనుమతించిన ఆధార్ కార్డు, ఫోటోతో కూడిన బ్యాంకు పుస్తకం, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పాన్‌కార్డు తదితర గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానిని చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఈసారి వాటిపై క్యూఆర్‌కోడ్ ముద్రించగా స్మార్ట్‌ఫోన్ ద్వారా స్కాన్‌చేస్తే ఓటరు వివరాలతోపాటు పోలింగ్ కేంద్రానికి సంబంధించి సమాచారం తెలుస్తుంది.


ఎవరి సర్వే వారిదే!



- సొంతంగా వివరాలు తెలుసుకుంటున్న అభ్యర్థులు
- నివేదికల ఆధారంగా వ్యూహాలు
- బెట్టింగ్‌ల కోసం కొన్ని సంస్థల సర్వేలు

(నరసన్నపేట)

'మన నియోజకవర్గంలో నా పరిస్థితేంటి? ఏ వర్గం ప్రజల్లోనైనా నా పట్ల వ్యతిరేకత ఉందా? ఎవరైనా నాకు వ్యతిరేకంగా పని చేస్తున్నారా? ఎవరెవరిని బుజ్జగించాలి? నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ఓటర్లను ఎక్కువగా ప్రభావితం చేసే వ్యక్తులెవరు? ప్రచారాన్ని ఏ విధంగా నిర్వహించాలి?'... అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులంతా ఇప్పుడు ఈ అంశాలను తెలుసుకునే పనిలో పడ్డారు. ఇందుకోసం సొంతంగా సర్వేలు చేయించుకుంటున్నారు. అధిష్ఠానాలు పార్టీల తరఫున సర్వేలు చేయిస్తున్నా... అభ్యర్థులు కేవలం వాటిపైనే ఆధారపడటం లేదు. పార్టీ అధిష్ఠానాల సర్వేలు గెలుపోటములు, మరికొన్ని అంశాలకే పరిమితమవుతున్నాయి. దీంతో అన్ని అంశాలను తెలుసుకునేందుకు అభ్యర్థులు వ్యక్తిగతంగా సర్వే చేయించుకుంటూ ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. కచ్చితంగా గెలవాలనుకునే నేతలంతా ఇలా రెండో అభిప్రాయం కోసం సర్వే సంస్థలను ఆశ్రయిస్తున్నట్లు ఏజెన్సీ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌కు చెందిన అభ్యర్థులు ఇలా సొంతంగా సర్వే చేయించుకునేందుకు పొరుగు రాష్ట్రంలోని ఓ ప్రధాన సర్వే సంస్థను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.



పార్టీలకు అదే ఆధారం

వాస్తవానికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ ప్రజానాడిని పట్టేందుకు సర్వేలనే నమ్ముకుంటున్నాయి. క్షేత్ర స్థాయిలో బలాలు, బలహీనతలేంటో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ముఖ్యంగా అధికార వైసీపీ అయితే ఇంటెలిజెన్స్ వర్గాలతో పాటు వివిధ సంస్థలతో ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటోంది. టీడీపీ, కాంగ్రెస్‌లు కూడా తమ వ్యూహకర్తల పైనే ఎక్కువగా ఆధార పడుతున్నాయి. వారు ఇచ్చిన సర్వేల ఆధారంగానే హైకమాండ్ అభ్యర్థులను ఎంపిక చేసింది. గతంలో ఎప్పుడూ రాజకీయ పార్టీలు ఇంతలా సర్వేలపై ఆధారపడలేదు. పోటీ చేయాలనుకున్న కొందరు నేతలు మాత్రమే సర్వే చేయించుకునేవారు. ఎన్నికల్లో పోటీ అంటే కోట్ల రూపాయల ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ముందుగా ఐదారు లక్షల రూపాయలతో సర్వే చేయించుకుని... తనకు గెలుపు అవకాశాలున్నాయంటేనే బరిలోకి దిగేవారు. కానీ ఈసారి పార్టీలే సర్వేలు చేయిస్తున్నాయి.

అంతు చిక్కని ప్రజానాడి

ఈసారి సర్వేల్లో కూడా పూర్తి ఖచ్చితత్వంతో కూడిన అభిప్రాయాలు వెల్లడి కావడం లేదని ఆయా సంస్థలే చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజానాడిని పట్టుకోలేకపోతున్నామని ఓ సర్వే సంస్థ ప్రతినిధి వెల్లడించాడు. ఓటర్లు మనసులో ఒక నిర్ణయంతో ఉండి.. పైకి మాత్రం మరోలా చెబుతున్నారని అంటున్నారు. అంతేకాకుండా తమ అభిప్రాయాన్ని స్పష్టంగా బయటపెడితే తమ ఉనికి ఎక్కడ బయటపడుతుందో, దానివల్ల మున్ముందు ఏ సమస్య వస్తుందోనన్న భయంతో కూడా సరైన సమాచారం ఇవ్వడం లేదంటున్నారు. ఓటర్లు చెప్పే దానికి... ఓటు వేసేవాడికి మధ్య కనీసం 2.5 శాతం తేడా ఉండే అవకాశాలు ఉన్నాయని సర్వే సంస్థలు చెబుతున్నాయి.

బెట్టింగుల కోసం..

ఏపీ ఎన్నికలపై బెట్టింగులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో రెండోసారి వైసీపీ అధికారంలోకి వస్తుందా? లేక టీడీపీ అధికారంలోకి వస్తుందా? అన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దీనిపై ఇప్పటికే పందెంరాయుళ్ల రంగంలోకి దిగి గెలిచే పార్టీ ఏదో తెలుసుకు నేందుకు సర్వే సంస్థల యజమానులను కలుస్తున్నట్లు సమాచారం. ఏజెన్సీలు ఇచ్చే నివేదికను బట్టి కోట్ల రూపాయల బెట్టింగులు జరగబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు తెలంగాణకు చెందిన కొందరు బెట్టింగ్ రాయుళ్లు కూడా సర్వే సంస్థలను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

నజరానాలు స్వీకరించినా శిక్షే

మీకు తెలుసా?

హిరమండలం: ఎన్నికల్లో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు పలు విధాలుగా ఓటర్లను ప్రలోభ పెడుతుంటాయి. డబ్బు, మద్యం, చీరలు, క్రికెట్ కిట్లు, క్రీడా సామగ్రి, తదితర నజరానాలు ఇస్తుంటాయి. వీటిని పంచుతూ నాయకులు, అభ్యర్థులు పట్టుబడితే అధికా రులు కేసులు నమోదు చేస్తుంటారు. కానీ వీటిని స్వీకరించడం లేదా స్వీకరించడానికి అంగీకరించడం కూడా ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్ 123 ప్రకారం నరమే అవుతుందని ఎన్నికల సంఘం పేర్కొంది. నజరానాలు స్వీకరించడం లేదా అంగీకరిం చినా ఐపీసీ సెక్షన్ 171 జైలు లేదా జరిమానా,లేదా రెండూ కలిపి విధించే అవకాశం ఉంది.

ఉదయం టీ.. మధ్యాహ్నం వెజ్ బిర్యానీ

- ఇదీ పోలింగ్ సమయంలో ఎన్నికల సిబ్బంది మెనూ

నరసన్నపేట: జిల్లాలో సాధారణఎన్నికల పోలింగ్ విధులకు నియమించిన సిబ్బందికి ఆది, సోమవారాల్లో ఇవ్వాల్సిన మెనూను ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. ఆదివారం సాయంత్రానికి ఎన్నికల సామగ్రితో సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారు. పోలింగ్ కేంద్రాలకు చేరిన వెంటనే సిబ్బందికి బొండాలు, గారెలు అల్పాహారం, మజ్జిగ లేదా టీ ఇవ్వాలి. రాత్రి 7.30 గంటలకు చపాతి లేక రోటి, అన్నం, ఆకుకూరపప్పు, రోటి పచ్చడి, టమాట ఆలుకూర, రసం, పెరుగు, వడియాలు లేదా అప్పడం, అరటి పండు ఇవ్వాలి. సోమవారం జరిగే పోలింగ్‌రోజు ఉదయం 4.30గంటలకు టీ, ఐదుగంటలకు వేడిఇడ్లి, గారె, రెండు చట్నీలు ఇవ్వాలి. తొమ్మిది గంటలకు ఫ్రూట్స్, మజ్జిగ లేదా కొబ్బరి నీళ్లు, 11 గంటలకు సమోసా లేక కేక్ టీ 12.30 గంటలకు వెజ్ బిర్యాని, పెరుగన్నం, నిమ్మకాయ పచ్చడి మూడుగంటలకు బిస్కెట్లు, టీ లేదా ఫ్రూట్‌సలాడ్, ఆరుగంటలకు బొండా, గారె చట్నీ, టీ, మజ్జిగ ఇస్తారు. ఇవన్నీ స్థానికంగా తయారు చేయించి ఫ్రెష్‌గా సరిపడేలా తయారు చేసి వడ్డించాలి. ఒక్కో పోలింగ్‌స్టేషన్ పరిధిలో 15 మంది సిబ్బందికి మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం అందించాలి.

వినూత్నంగా ఎన్నికలకు ఆహ్వానం

- సోషల్ మీడియాలో వైరల్



శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి: సార్వత్రిక ఎన్నికల వేళ సోషల్ మీడియాలో నెటిజనులు సృజనాత్మకతను చాటుకుంటూనే ఉన్నారు. ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న జరగనుంది. ఈ పోలింగ్‌కు వచ్చి ఓటు వేయాలని కోరుతూ వినూత్నంగా నెటిజనులు ఆహ్వాన పత్రికను తయారు చేశారు. ఎన్నికల తేదీ, వేదిక, విందు, ఆకాం క్ష అంటూ ఆహ్వాన పత్రిక హల్‌చల్ చేస్తోంది. ఆహ్వాన పత్రిక చివరిలో 'ఇట్లు భవదీయులు... తల రాతను మార్చే శక్తే ఈ ఓటు' అంటూ ముగించారు.

తొలిసారి 499 లోక్‌సభ స్థానాలకే పోలింగ్

మీకు తెలుసా?

(హిరమండలం)



దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం 1952లో మొదటిసారి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. తర్వాత 22 రాష్ట్రాలకు ఎకేసారి ఎన్నికలు జరిగాయి. మొదట్లో 21 ఏళ్ల నిండిని వారికి ఓటుహక్కు కల్పించారు. 4,500 శాసనసభ, 499 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. తొలి సార్వత్రిక ఎన్నికల్లో 17 కోట్లమంది ఓటర్లు పాల్గొన్నారు. ఇందులో 85 శాతం మంది నిరక్షరాస్యులే. బ్యాలెట్ పేపర్లపై అభ్యర్థుల పేర్లతో పాటు గుర్తులు ముంద్రించారు. కాంగ్రెస్, సోషలిస్టు పార్టీ, భారతీయ జనసంఘ, కమ్యూనిస్టు పార్టీలు పాల్గొన్నాయి. కాంగ్రెస్ పార్టీ 364, కమ్యూనిస్టులు 16, భారతీయ జనసంఘ్ మూడు, మిగతా స్థానాల్లో ఇతర పార్టీ గెలిచాయి. దేశానికి మొదటి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ బాధ్యతలు చేపట్టారు.

నన్ను గెలిపిస్తే..

వలసలను నివారిస్తా

- సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి
- పాతపట్నం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు



ఇంటర్వ్యూ

(పాతపట్నం)

ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే వలసల నివారణకోసం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సాంకేతికవిద్య, వృత్తినైపుణ్యత కేంద్రాలు ఏర్పాట్లు చేయనున్నట్లు పాతపట్నం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుచేస్తామని తెలిపారు. శుక్రవారం ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ముఖాముఖి నిర్వహించింది. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.

ప్రశ్న: పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తారా.?

జవాబు: ఆఫ్‌షోర్ పూర్తిచేయించి మెళియాపుట్టి ప్రాంత ప్రజల దీర్ఘకాలికసమస్యను పరిష్కరిస్తాను.

ప్ర: ఇక్కడ ఉన్న సహజవనరులపై గతపాలకులు దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. వీటిని ఎలా అధిగమిస్తారు.?

జ: ఇక్కడ వర్షాధార భూములే ఎక్కువగా ఉన్నాయి. దీంతో అధికశాతం ప్రజలు వలసలు వెళ్లిపోతున్నారు. ఈ సమస్య పరిష్కరించేందుకు నదుల అనుసంధానం చేయా లన్న ప్రతిపాదనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది. దీంతోపాటు సాగు,తాగునీటి సమస్యలను శాశ్వత ప్రాతి పదికను పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించి ప్ర భుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం.

ప్ర: స్థానిక నినాదంతో టికెట్ సాధించారు. దీనిని నిలబెట్టుకునేందుకు ఏవిధంగా కృషి చేస్తారు.?

జ: నేరుగా కాదు. దీర్ఘకాలంగా అటు సామాజిక కార్యక్ర మాలు చేపడుతున్నాను. ప్రజలు ఇటు పార్టీకి అండగా నిలిచాను. గతంలో వైస్‌ఎంపీపీగా మా తల్లి మహాలక్ష్మి పదవి చేపట్టి ప్రజానీకానికి సేవలందిస్తూవచ్చాం. నియో జకవర్గంలో చోటుచేసుకొన్న పరిణామాల మధ్య 2019లో టీడీపీ సీటు ఇస్తారని ఆశించాను. అయితే పార్టీ అధినేత చంద్రబాబునాయుడు 2024లో సీటిస్తామని భరోసాఇచ్చారు. ఇచ్చినమాట మేరకు అభ్యర్థిగా బరిలో నిలవడం ఆనందంగా ఉంది. పార్టీ అధిష్ఠానం నమ్మకాన్ని వమ్ముచేయను. ప్రజలకు, పార్టీకి ఉత్తమ సేవలందించి అందరి విశ్వసనీయత పొందుతాను.

ప్ర: ఎమ్మెల్యే రెడ్డి శాంతికి దీటుగా నిలుస్తారా?

జ: నియోజకవర్గ ప్రజలు రాజకీయ చైతన్యం గలవారు. కొత్తవారిని ఎప్పుడూ స్వాగతిస్తుంటారు. స్థానిక ఎమ్మెల్యే రెడ్డిశాంతిపై ఆ పార్టీ నాయకులు విసిగిపోయి ఆ పార్టీ నాయకులు అధికశాతం టీడీపీలో చేరారు. దీర్ఘకాలంగా సామాజిక సేవలందిస్తూ నియోజక వర్గ ప్రజలకు సుపరిచితుడిగా ఉన్నాను. నాకు టికెట్ ప్రకటించిన తర్వాత ఇటీవల ఆమె నేనెవరో కూడా తెలియదని అన్నారంటే సామాజిక స్థితిగతులపై ఆమెకు ఉన్న అవగాహన ఏపాటిదో తెలుస్తుంది. మార్పుకోరే ప్రజలు మద్దతుగా నిలిచి గెలిపిస్తారు. అందులో సందేహంలేదు.

ప్ర: నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఐదేళ్లు సేవలందించిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి ఏమేరకు మీవిజయానికి సహకరిస్తారు.?

జ: వివిధ సర్వేలు నిర్వహించి ప్రజానీకం అభీష్టం మేర కు నన్ను అభ్యర్థిగా ప్రకటించారు. అభ్యర్థి ఎవరైనా అంద రమూ సమష్టిగా పనిచేస్తాం. ఎన్నికల నిర్వహణలో, ముందునుంచి పార్టీకి సేవలందించిన వారికే ప్రాధాన్యతా క్రమంలో ముందుంచుతా. అందులో సందేహంలేదు. మా మధ్య ఎటువంటి విభేదాలు లేవు. ఇంకా ఏమైనా స్వల్ప విభేదాలు ఎవరిలోనైనా ఉంటే వాటిని జిల్లా నాయ కులు, అధిష్ఠానం ఎప్పటికప్పుడు చొరవచూపి పరిష్కరిస్తారు.

ప్ర: విజయావకాశాలు ఎలా ఉన్నాయి.?

జ: టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. అభ్యర్థి మార్పుపై కూడా ప్రజలు సానుకూలంగా ఉన్నారు. వైసీపీ పాలనా, స్థానిక ఎమ్మెల్యే వైఫల్యాలు నాకు విజయా వకాశాలకు దగ్గరగా చేర్చుతాయి. పోస్టల్ బ్యాలెట్ వన్‌సైడ్ పోలైనట్లు తెలుస్తోంది. కనీసం 20 నుంచి 30వేల మెజార్టీతో గెలుస్తాను.

ప్ర: గిరిజనుల అభివృద్ధికి ఏం చేస్తారు.?

జ: వైసీపీ పాలనలో జిల్లాల విభజన పేరుతో ఐటీడీఏ లేని జిల్లాగా మిగల్చడంతో గిరిజనులు తీవ్ర నిరాశతో ఉన్నారు. ఇప్పటికే మా అధినేత చంద్రబాబు ఐటీడీఏ ఏర్పాటుకు హామీఇచ్చారు. ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు, తాగునీటి సదుపాయం కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించుకొని సమస్యల పరిష్కారానికి చొరవచూపుతాను.

ప్ర: పాతపట్నంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తారా.?

జ: చంద్రబాబు ఇటీవల రోడ్‌షోలో పాతపట్నంలో అగ్నిమాపకకేంద్రం ఏర్పాటు గురించి ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఏర్పాటు చేస్తాం.

ప్ర: వలసల నివారణకు మీరు ఎటువంటి చర్యలు తీసుకుంటారు.?

జ: పారిశ్రామిక హబ్ ఏర్పాటుచేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.

ప్ర: యువతను ఆదుకునేందుకు ఏం చేస్తారు.?

జ: ఐటీఐ, పాలిటెక్నికల్, ఇంజినీరింగ్, నర్సింగ్, వైద్య విద్య వంటి ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు కృషి చేస్తాను. పరిశ్రమల నిర్వహణకు అవసరమయ్యే ఉద్యోగులు తయారుచేసేందుకు చర్యలు తీసుకుంటాను.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

- చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- కూటమి అభ్యర్థుల ముమ్మరం ప్రచారం

టెక్కలి/పొందూరు/హరిపురం/వజ్రపుకొత్తూరు/రణస్థలం/నరసన్నపేట, అరసవల్లి, మే 10: సీఎం జగన్ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని కూటమి అభ్యర్థులు పేర్కొన్నారు. శుక్రవారం వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పారు. వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టెక్కలి మండలం పెదసానలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు, మందస మండలం మకరజోలలో శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడ, పొందూరులో ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్, వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురంలో పలాస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష, నరసన్నపేటలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి, శ్రీకాకుళం నగరంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్, రణస్థలంలో బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. జగన్ ఓ సైకో అని, మరోసారి అధికారం అప్పజెబితే రాష్ట్రాన్ని రావణకాష్టంలా మారుస్తారని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. తమకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.



టెక్కలి:పెద్దసానలో ఉపాధి కూలీలతో కింజరాపు అచ్చెన్నాయుడు



పొందూరులో రోడ్ షో నిర్వహిస్తున్న కూన రవికుమార్



హరిపురం: మందస మండలం మఖరజోల ఆలయం వద్ద అభివాదం చేస్తున్న రామ్మోహన్



వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురంలో మాట్లాడుతున్న గౌతు శిరీష



అరసవల్లి: శ్రీకాకుళం నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న గొండు శంకర్



రణస్థలం: జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న నడుకుదిటి ఈశ్వరరావు



నరసన్నపేట: టీడీపీ కార్యాలయం వద్ద కార్యకర్తలతో బగ్గు రమణమూర్తి

'సూపర్ సిక్స్'తో అన్ని వర్గాలకు మేలు: ఎంజీఆర్



ప్రచారం చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి గోవిందరావు

కొత్తూరు: సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందని పాతపట్నం కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. శుక్రవారం కొత్తూరు, కర్లెమ్మ, పారాపురం, గూనభద్ర నిర్వాసిత గ్రామాలు, మెట్టూరు, కృష్ణాపురం గ్రామాల్లో ఆయన రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షో కొత్తూరుకు చేరగానే భారీ వర్షం కురిసినా జోరు వానలో హోరుగా ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ మాట్లాడుతూ.. ఈనె 13న జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఉమ్మడి కూటమిని అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరన్నారు. తనను ఎమ్మెల్యేగా, రామ్మోహన్ నాయుడును ఎంపీగా గెలిపించాలని, పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవర ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ బైరాగినాయుడు, భగవాన్ దాసు నాయుడు, ఎద్దు దాసునాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హిరమండలం: కూటమి తరఫున పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావును గెలిపించాలని కోరుతూ జడ్పీటీసీ పి.బుచ్చిబాబు శుక్రవారం వివిధ గ్రామాల్లో ప్రచారం చేశారు. కూటమి విజయంతో రాష్ట్రంలో మళ్లీ సాధారణ పరిస్థితులు వస్తాయన్నారు. అన్ని వర్గాల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని, ఈనెల 13న జరుగు ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి.తిరుపతిరావు, నాగరాజు, దారపు డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటేస్తే రాష్ట్రం అధోగతి: అచ్చెన్నాయుడు



బొరిగిపేట వద్ద యాదవులు ఇచ్చిన గొడుగు, చేతికర్రతో కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి: వైసీపీ ఓటు వేస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం టెక్కలి మండలం పెద్దసాన, రాధావల్లభాపురం, బొరిగిపేట, లచ్చన్నపేట గ్రామాల్లో ఉమ్మడి నేతలు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైకో సీఎం జగన్ ప్రభుత్వం మూలంగా రాష్ట్రం అల్లకల్లోలమైందని, మళ్లీ గాడిలో పడాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజల కు సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. మహిళా సంక్షేమానికి పాటుపడతా మన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకా శాన్నంటాయని, వైసీపీకి ఇవే చివరి ఎన్నికలు కావాలని అన్నారు. టెక్కలి మేజర్ పంచాయతీలో అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, పోలవరం సర్పంచ్ గురు వెల్లి చిన్నమ నాయుడు, మాజీ సర్పంచ్ కోట శివయ్య, నేతలు చంద్రరావు, కోళ్ల లవ కుమార్, దోని బుజ్జి, రాము, ప్రీతీష్, కోళ్ల కామేసు, జనసేన నాయకులు అవినాష్, కూరాకుల యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కోసం టీడీపీని గెలిపించండి: శిరీష



బెల్లుపటియాలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌతు శిరీష

హరిపురం/ వజ్రపుకొత్తూరు: ప్రతి ఒక్కరికీ సంక్షేమం కావాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని పలాస నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. శుక్రవారం మందస మండలం బెల్లుపటియా, పొత్తంగి, సిరిపురం, హొన్నాళి, సిద్ధిగాం, వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురం, కొత్తపేట, సైనూరు, అనంతగిరి, రిట్టపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అన్ని గ్రామాల్లోనే ఆమెకు మహిళలు మంగళహారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో రైతులు, ప్రజలు తమ భూములపై హక్కులు కోల్పోతారన్నారు. ఉమ్మడి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఉమ్మడి మేనిఫెస్టోను అమలు చేయడం ద్వారా అన్ని వర్గాలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఉమ్మడి ప్రభుత్వాన్ని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకు లు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, కృష్ణారావు, డొంకూరు తిరుపతిరావు, కె.గోపాల్ పుచ్చ ఈశ్వరరావు, దున్న షణ్ముఖ, గోవిందు పాపారావు, కర్ని రమణ, మాజీ ఎంపీపీ గొరకల వసంతస్వామి తదితరులు పాల్గొన్నారు. ● **పలాస:** పట్టణంలోని 20 వార్డు లేబర్ కాలనీకి చెందిన 50 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో పలాస సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కెల్లి ఆనంద్, మల్లా శ్రీనివాస్, బొంపల్లి అప్పారావు, పిట్ట రవి తదితరులు పాల్గొన్నారు.

పేదల భూముల కబ్జాకే ల్యాండ్ టైటిలింగ్ చట్టం: శంకర్

అరసవల్లి: పేదల భూములను కబ్జా చేసేందుకే వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమలు చేస్తోందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ నేతలను బంగాళా ఖాతంలో కలపాలని శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగర పరిధిలోని 38వ డివిజన్‌లో శుక్రవారం ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, కూటమికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మంత్రి ధర్మాన నగరంలో అభివృద్ధి పను లు చేయలేదు సరికదా కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేకపోయారని విమ ర్శించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా రామ్మోహన్ నాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమర కమల, బుర్రా ప్రసాద్, బుర్రా సత్తిబాబు, తంగుడు చంద్రరావు, ఫైలపల్లి నర్సింహమూర్తి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ సర్వేశ్వరరావు, ఉమ్మడి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్ర వారం బూత్ ఇన్‌చార్జిలతో శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో బూత్ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్లకు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, కొమ్మనాపల్లి వెంకటరామరాజు శిక్షణ నిర్వహించారు.



బూత్ కమిటీ ఇన్‌చార్జిల సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి గొండు శంకర్

వైసీపీకి బటన్ నొక్కితే భూములు గోవిందా: ఎంపీ



హరిపురంలో ఎంపీకి తిలకం దిద్దుతున్న మహిళలు

హరిపురం: గడచిన వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిలేక విధ్వంస పాలన చూశామని, మరో మారు ఆ పార్టీకి బటన్ నొక్కితే అందరి భూములు గోవిందా అని ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. మఖరజోల, వీరభద్ర, లోహరిబంద, బిన్నల, వీవీఆర్‌పురం, గోవిందపురం, బీఎస్‌పురం, పితాతోళి, బాలిగాం, హరిపురం, మందస గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. సైకో పాలనను సాగనంపాలని కోరారు. మన బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం చంద్రబాబును సీఎం చేయాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ఉన్న అను మానాలపై కనీసం నివృత్తి చేయకపోగా ఎదురు దాడి చేయడం దారుణ మన్నారు. ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించండి.. మీ భూములపై మీకు హక్కులు ఉండాలంటే టీడీపీకి ఓటేయండని పిలుపునిచ్చారు. ఉమ్మడి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించి సంక్షేమ పథకాలు అమలు చేస్తా మన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎంపీగా, శిరీషను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొర్ల కన్నారావు, రుద్రయ్య, వాయిలపెల్లి మాధవరావు, బమ్మిడి కర్రయ్య, జి.తిరుపతిరావు, బి.గున్నయ్య, వాసు, కారి ఈశ్వరరావు, కొత్ర రామారావు, వైకుంఠరావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయాలి: బగ్గు

నరసన్నపేట: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును సీఎంగా చేసేందుకు కార్యకర్తలు, నేతలు సైనికుల్లా పనిచేయాలని నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నా రు. పార్టీ కార్యాలయంలో పంచాయతీ స్థాయిలో కార్యకర్తలు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. ప్రతీ ఓటు కీలకమని, వారంతా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బాబు మళ్లీ రప్పిద్దాం పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలగవలస పంచాయతీకి చెందిన ఐదు వైసీపీ కుటుం బాలు టీడీపీలో చేరాయి. వీరికి బగ్గు రమణమూర్తి కండువాలు కప్పి ఆహ్వానిం చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అడపా చంద్రశేఖర్, ముద్దాడ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

గొటివాడ పంచాయతీ నుంచి చేరికలు

జలుమూరు: గొటివాడ పంచాయతీ మహమ్మద్‌పురం నుంచి పలువురు యువకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శుక్రవారం వీరికి టీడీపీ క్యాంపు ఆఫీసులో ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ నేతలు ధర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ, సురవరపు తిరుపతిరావు, పట్ట ఉమారావు, చల్ల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



మహమ్మద్‌పురం యువకులకు కండువా వేసి ఆహ్వానిస్తున్న బగ్గు రమణమూర్తి

గెలిపించండి.. అభివృద్ధి చేస్తా: రవికుమార్



విక్టరీ సింబల్ చూపిస్తున్న ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్

బూర్జ: రానున్న ఎన్నికల్లో ఎమ్మె ల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభి వృద్ధి చేస్తానని ఆమదాల వలస ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి కూన రవి కుమార్ అన్నారు. బూర్జ, వైకుంఠపురం, బొడ్డపాడు గ్రామా ల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. వైసీపీని ఇంటికి పంపి టీడీపీని గెలిపించడం ద్వారా బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకో వాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత యువతకు ఉపాధి కల్పన, రైతులకు ఆర్థిక భరోసా కోసం కృషి చేస్తామన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలిసి పోరాడు తున్నా రన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. **పొందూరు:** పొందూ రులో శుక్రవారం ఉమ్మడి కూటమి అభ్యర్థి కూన రవి కుమార్ ఎన్నికల ప్రచారం చేశారు. అంబేడ్కర్ కూడలి నుంచి ప్రారంభమైన రోడ్ షో వివిధ ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియో జకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, పట్టణ అధ్యక్షుడు ఎ.చినరంగ, నేతలు ఎ.రాము, శంకర భాస్కర్, బాడాన గిరి, హారిక తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి: ఈశ్వరరావు



ఎన్డీఏ కూటమిలో చేరిన వైసీపీ కార్యకర్తలతో ఉమ్మడి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు తదితరులు

లావేరు: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎచ్చెర్ల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నడు కుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం పెదకొత్తపల్లి, బొంతుపేట, వెంకటరావుపేట, మెట్ట వలస, బుడతవలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటేసి కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా గెలిపించాలని కోరారు. తనను ఎమ్మెల్యే గెలిపించిన ఆరు నెలల్లోగా ఇంటింటికీ కొళాయి నీటిని అందిస్తానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పిన్నింటి మధుబాబు, లంక నారాయణరావు, పి.శ్రీరాములునాయుడు, కోనేటి శ్రీనివాస రావు, బి.విజయ్ కుమార్, దోమాన రామకృష్ణ, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిలోకి వైసీపీ నేతలు

రణస్థలం: మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన బిర్లంగి సాయిరామ్, ముక్కు రమణ, ముక్కు గణేష్, రాము, దేబారికి ఆదినారాయణ, జగన్‌తో పాటు మరో 47 వైసీపీ కుటుంబాలు శుక్ర వారం ఎన్డీఏ కూటమిలో చేరారు. వీరందరికీ ఎచ్చెర్ల బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు కండువాలు వేసి ఆహ్వానించారు. యువతకు అన్ని విధాలా అదుకుంటానన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

స్టేట్‌హోమ్‌లో మహిళలకు మంచి వసతులు కల్పించాలి

గుజరాతీపేట: స్టేట్ హోమ్‌లో ఉన్న మహిళలకు మంచి వసతులు కల్పించా లని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయం వద్ద స్టేట్‌హోమ్‌ను శుక్రవారం సందర్శించారు. ఈసందర్భం గా న్యాయాధికారి మాట్లాడుతూ మహిళలకు పౌష్టికాహారం, మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కేవీ రమణ, స్టేట్ హోం ఆఫీసర్ అరుణ పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా ఉచిత న్యాయ సేవలు

జైలు ముద్దాయిలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా ఉచిత న్యాయ సేవలు అందించడం జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా కారాగారాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి కారాగారంలో ఖైదీలకు అందుతున్న వసతులను పరిశీ లించారు. ఖైదీలు ఎవరికైనా న్యాయవాదిని పెట్టుకొనేందుకు ఆర్థిక స్థోమత లేకుంటే వారికి ఉచిత న్యాయ సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జైలర్లు ఉదయ్ భాస్కర్, దివాకర్ నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుని చందనోత్సవం

నందిగాం: నందిగాం మధుర సుబ్బమ్మపేటలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి వారి చందనోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా వైశాఖ శుద్ధ తదియ నాడు చందనోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం సుప్రభాతం అనంతరం విశేషపూజలు చేశారు. బాలసీమకు చెందిన వేదపండితులు చామర్తి శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు కె.రామానుజాచార్యులు పర్యవేక్షణలో స్వామికి చందనం పూత మేళ తాళాల మధ్య చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కె.శ్రీరంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. ● **ఇచ్ఛాపురం:** శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయాల్లో చందనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దాసన్నపేట జంక్షన్, కస్పాగౌడ వీధిలోని దేవాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. వివిధ రకాల పండ్లతో స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. మార్కెట్ వద్ద ఉన్న సత్యనారాయణస్వామి దేవాలయంలో చందనోత్సవం వైభవంగా నిర్వహించారు.

టీడీపీలో మాజీ కౌన్సిలర్లు చేరిక



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాల్టీ 23వ వార్డు బెల్లుపడ కాలనీ వైసీపీకి చెందిన ఇద్దరు మాజీ కౌన్సిలర్లు పార్వతీశం, గేదెల తాతయ్యతో పాటు 100 టీడీపీలో చేరారు. శుక్రవారం రామయ్యపుట్టుగలో తన స్వగృహంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండా శంకర్‌రెడ్డి, నందికి జాని, బచ్చు శంకర్, రంగాల శ్రీను తదితరులు పాల్గొ న్నారు. ● **సోంపేట:** ఎమ్మెల్యే బెందాళం అశోక్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిర్మలారెడ్డి అనంతపురంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

హిందూధర్మ రక్షణ.. కూటమితోనే సాధ్యం: శ్రీనివాసానంద



చంద్రబాబునాయుడుతో స్వామీజీలు

పొందూరు: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో రక్షణ కరువైన హిందూ ధర్మానికి తిరిగి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద అన్నారు. శుక్రవారం పలువురు స్వామీజీలతో కలిసి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును అమరావతిలో కలిశారు. సీఎం జగన్ పాలనలో హిందువులకు, హిందూ సమాజానికి రక్షణ లేకుండాపోయిందని వారు చంద్రబాబు ఎదుట వాపోయారు. హిందువుల పవిత్ర తిరుమల తిరుపతిని వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఫిర్యాదు చేశారు. టీడీపీ ప్రభుత్వం వస్తే స్వామీజీలకు టీటీడీలో సమున్నత స్థానం కల్పిస్తామని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా స్వామీజీలు ప్రతీ హిందువు ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి హిందూ ధర్మాన్ని కాపాడాలని కోరారు.

ఓట్ల కోసం కులం పేరుతో చిచ్చు పెట్టొద్దు

రణస్థలం: ప్రశాంతంగా ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఓట్ల కోసం కులం పేరుతో చిచ్చుపెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని విజయనగరం పార్లమెంట్ టీడీపీ కోశాధికారి పిషిని జగన్నాథం నాయుడు అన్నారు. శుక్రవారం కోష్ట గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఐదేళ్లు ఉండి కాపు కులస్థుల కోసం ఏం చేశావని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. వైసీపీని వీడి ఎన్డీఏ కూటమిలో కాపు సామాజికవర్గం వారు ఎన్ఈఆర్‌ను బలపరుస్తున్నారన్నారు. టీడీపీ నాయకుడిగా పనిచేస్తున్న తనకు ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ నుంచి ప్రాణహాని ఉందన్నారు. ఇప్పటికే అధికారులతో దాడులు చేయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడని ఆరోపించారు. చిన్న వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న తన బంధువులను ఇబ్బందిపెడుతున్నారన్నారు. ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు మంచి మెజార్టీతో గెలుస్తారని మాజీ జడ్పీటీసీ గొర్లె లక్ష్మణరావు, పైడి అప్పడుదొర అన్నారు. కార్యక్రమంలో వెలిచేటి సరేష్, పిషిని అసిరినాయుడు, గురాన రామారావు, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీడితోట దగ్ధం

సంతబొమ్మాళి: యామలపేటలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా సుమారు రెండు ఎకరాల జీడితోట దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గద్దాయి ఆనందరావు జీడి తోట పైనుంచి వెళుతున్న హైటెన్షన్ వైర్లు ఒకదానికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న కుద్ది హేమారావు, సాహుకారి యమున, రౌతు దుర్గా ప్రసాద్, మరదలై దానయ్య, సాహుకారి ప్రసాద్‌లకు చెందిన జీడి తోటలు ఒక్కసారిగా అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన

టెక్కలి: ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో డిస్ట్రిబ్యూటరీ కేంద్రాన్ని ఆర్వో, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ శుక్రవారం పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయనతో పాటు ఏఆర్వో మురళీకృష్ణ ఉన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ రాధిక



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

టెక్కలి: ఎన్నికల సందర్భంగా పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఏమరపాటుగా ఉండకూడదని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. శుక్రవారం ఆదిత్య ఇంజనీ రింగ్ కళాశాలలో సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొబైల్ పార్టీలో ఉన్న సిబ్బంది యూనిఫామ్ ధరించాలని, ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే సంబంధించిన సమాచారం ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. పోలింగ్‌స్టేషన్‌ను సందర్శించినప్పుడు అక్కడ ఓటర్లు క్యూలో అస్తవ్యస్తంగా ఉంటే సరిచేసి పోలింగ్ సిబ్బందికి తగు సూచనలు చేయాలన్నారు. డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ స్థానిక ప్రజలతో మాట్లాడి స్వేచ్ఛగా ఓటుహక్కును విని యోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీలు ప్రేమకాజోల్, గంగాధర్, డీఎస్పీ బాలచంద్రారెడ్డి, ట్రైనీ డీఎస్పీ సీహెచ్ రాజా, సీఐలు పైడయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు. ● **నరసన్నపేట:** ప్రతీ ఒక్కరు ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఏఎస్పీ ప్రేమ్ కాజల్ సూచిం చారు. శుక్రవారం జట్టు కలాసీ యూనియన్ భవనం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ప్రసాదరావు, ఎస్ఐ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు జరగకుండా గట్టి చర్యలు

పలాస: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 13న జరగనున్న పోలింగ్ సందర్భంగా అల్లర్లు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని కాశీబుగ్గ సీఐ ఎన్.విజయానంద్ తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు ఐటీడీఏ ఏదీ: పరమేశ్వరరావు

అరసవల్లి: జిల్లా విభజన తరువాత జిల్లాలో ఐటీడీఏ లేకుండా అధికార వైసీపీ ప్రభుత్వం గిరిజనులను అనాథలుగా మార్చిందని డీసీసీ అధ్యక్షుడు, ఎంపీ అభ్యర్థి పేడాడ పర మేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 30 మండలాలున్న జిల్లాలో ఐటీడీఏ అవసరాన్ని వైసీపీ ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. జిల్లాలో లక్షకు పైగా ఉన్న గిరిజ నులు తమ అవసరాల నిమిత్తం పక్క జిల్లాలో ఉన్న ఐటీడీఏకు వెళ్లాల్సి వస్తోందని ఆవే దన వ్యక్తంచేశారు. ఐటీడీఏ ఏర్పాటుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలి పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి కృష్ణారావు, నేతలు గోవింద మల్లిబాబు, సీపీఎం, సీపీఐ నాయకులు డి.గోవిందరావు, టి.తిరుపతిరావు, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

95 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్



శ్రీకాకుళం క్రైం: నగరంలోని ఇలిసిపురం ప్రాంతంలో ఓ వ్యక్తి సంచిలో మద్యం సీసాలను తరలిస్తూ రెండో పట్టణ పోలీసులకు పట్టుపట్టాడు. వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఇలిసిపురం ప్రాంతానికి చెందిన కింజరాపు రవి కుమార్ ద్విచక్ర వాహనంలో 95 మద్యం సీసాలను తరలి స్తుండగా ముందస్తు సమాచారం మేరకు టూటౌన్ సీఐ ఉమామహేశ్వరరావు రెక్కీ నిర్వహించి ద్విచక్ర వాహనాన్ని పట్టుకున్నారు. నిందితుడి వద్ద బ్యాగ్‌లో ఉన్న 95 మద్యం సీసాలను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు.

నైటెంగేల్ జయంతి

శ్రీకాకుళం క్రైం: నగరంలోని నర్సింగ్ కళాశాలలో శుక్రవారం ప్రోగ్రాం ఆఫీసర్ కె.పద్మావతి ఆధ్వర్యంలో ఫ్లోరెన్స్ నైటెంగేల్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హను మంతు సాయిరాం నైటింగేల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.